# అపశృతి

ఆ బేచ్‌లర్ రూంలో ఒక్కొక్కళ్లు ఒక్కో ఐటమ్ చొప్పున డిన్నర్ తయారీలో ఉన్నారు.

నిరంతరం వార్తా ఛానల్‌లో.... పద్దెమ్దోసారి ప్రొద్దున్న చూపించిన పాచి వార్తలు ప్రసారమవుతున్నాయి.

ముసుగు వేసుకున్న ఓ అర్భకప్రాణి చుట్టూ నలుగురు జమా

జెట్టీల్లాంటి మీసాల పోలీసులు – టీవీ వాళ్లు కవర్ చేస్తారనేమో షోగ్గా నిలబడి వికటాట్టహాసాల్ని విజయహాసాలుగా చేస్తూ... దొంగ గురించి వివరాలు చెప్తున్నాడు పెద్ద మీసాలాయన.

“ఈ వ్యక్తిని చూస్తే దొంగ అనుకోం. ఋషిలా గెడ్డం కనుబొమ్మల మధ్య ఎర్రటి బొట్టు– ఉండుండి. తెల్సున్న వాళ్ల ఇళ్లల్లో దొంగతనాలు చేస్తాడు. గొప్ప సంగీత కుటుంబంలో పుట్టిన ఈ వ్యక్తి ఆ కళలోనూ, చోరకళలోనూ నిష్ణాతుడే”

“వార్తల్లో కవిత్వాలూ కామెంట్స్ ఎక్కువైపోతున్నాయి. అసలు న్యూస్‌ని న్యూస్‌గా...” అంటూ ఏదో చెప్పబోతున్నాడు సంతోష్.

“అరె... వాగుడాపరా – వాడు మా గోపాల్‌గాడులా ఉన్నాడు” అన్నాడు కేఎమ్.

“ఎవడా మీసాల పోలీసా?”

“కాడెహే... ఆ గోపాలకృష్ణ”

“ఆ ముసుగు దొంగా?” గొల్లున నవ్వాడు మూర్తి.

“ముసుగులో దొంగని పోల్చుకున్నావంటే నువ్వు తోడుదొంగవన్న మాట” అన్నాడు సంతోష్.

“కొంచెంసేపు మాట్లాడకండిరా... ప్లీజ్...” కేఎమ్ కస్సుమన్నాడు.

పోలీసు మీసం చిత్రంగా పైకీ కిందకీ కదుల్తోండగా నేపథ్యం నుంచి న్యూస్సమ్మ కామెంట్రీ స్టార్టయింది.

“ఈ గోపాలకృష్ణ తల్లితండ్రులూ, చిన్నమ్మలూ, అన్నయ్యలూ... అందరూ సంగీతంలో ఉద్దండపండితులే. కోయిల పుట్టగానే పాట నేర్చినట్లు

పదిహేనో సంవత్సరానికే ప్రముఖ సంగీతజ్ఞుల సరసన సహకార వాయిద్య కారుడుగా సరిపడే వయోలిన్ నేర్చుకున్నాడు. గాత్రంలోనూ... స్వర రచనలోనూ కొన్ని మెట్లు కూడా సునాయసంగా అధిరోహించాడు. ముఖ్యంగా నాట్యకారులకి నట్టువాంగం చేయడం, గానం, సంగీత కూర్పుల్లో అనుభవాన్ని సంపాదించాడు. 30 ఏళ్ళకి... పదేహేనేళ్ల ముందే వయోలిన్‌లోనూ... గాత్రంలోనూ గురువై అనేకమందికి సంగీతం నేర్పడం మొదలెట్టాడు. అలాగే... అదే కళని ఆరాధిస్తే, అతను మంచిస్థాయి కళాకారుడయ్యేవాడు. కానీ ఆ పసి వయస్సులోనే శిష్యురాళ్లుగా వచ్చిన అమ్మాయిలతో ప్రేమకలాపాలు ప్రారంభించాడు. అతని కళని చూసి ఆరాధించిన వాళ్లలో కొందరు అతనిలో కల్మషాన్ని గమనించి సంగీత పాఠాలు మాని జీవితాని కాపాడుకున్నారు. కొందరు గుట్టురట్టు కాకుండా గట్టేక్కేశారు..."

ఇలా... టీవీ ఏంకర్ నేపథ్యంలో వ్యాఖ్యానిస్తుండగా షడన్‌గా కరెంటు పోయింది.

మిగిలిన కథ కేఎమ్ కంటిన్యూ చేశాడు. "వాడు చిన్నప్పుడే గొప్ప వాడయిపోవటం - అయిపోయినట్లు వాడికీ తెల్సిపోవటం... వాడి బతుకుని నాశనం చేసింది. కష్టపడి సాధిస్తేనే ఏదైనా నిలబెట్టుకుంటాం"

"దొంగతనం చెయ్యవలసిన పనేంట్రా మీ వాడికి"

"అదేరా... నాకూ అర్థం కావట్లేదు" కేఎమ్ విచారంగా అన్నాడు.

అంతలో పవర్ వచ్చింది. టీవీ మొదలైంది. "దానికి తోడు తాగుడు అలవాటు అవడం, ఆ అలవాటు ముదరటంతో కచేరీలకి పిలుపులు - పాఠాలూ అన్నీ హరించుకుపోయాయి. ఇంక దొంగతనమే అతనికి ఏకైక మార్గంలా కనిపించింది. వెనకటి పరిచయానికో, పాటలో

పాండిత్యానికో, కుటుంబం మీద ఉన్న గౌరవానికో ఈ వ్యక్తిని ఇంట్లోకి రానిచ్చి... అన్నం పెట్టిన స్నేహితుల ఇళ్లల్లోనే... దొంగతనాలు చేసేవాడు. పూజా గదిలో వెండి దీపాలు, విగ్రహాలూ, సెల్‌ఫోన్లూ, చైన్లూ ఒకటేమిటి చక్కగా పాడుతూనే అదను చూసి చల్లగా చోరకళ ప్రదర్శించాడు. ఇటీవల ఒక స్నేహితుడి ఇంట్లో దొంగిలించిన సెల్‌ఫోన్ ద్వారా ఇతను చేసిన ఫోను నెంబర్లు ఆరా తీయగా ఆచూకీ దొరికి ఇతని ఆట కట్టింది."

✢ ✢ ✢

ముసుగులో కొడుకుని చూసి కన్నతల్లి కన్నీళ్లు కట్టలు తెగాయి.

సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చిన అన్నగారికి అతని భార్య ఈ తమ్ములుంగారి టీవీ దర్శనం గురించి చెప్పి కావల్సినంత దెప్పిపొడిచింది.

పెద్దపెద్ద పేరు ప్రఖ్యాతుల్లో ఉన్న సంగీత బంధువులందరూ ఇంక వాణ్ని ఇంటికి రానివ్వకూడదని ఒకరికొకరు ఫోనుల్లో నిర్ణయించుకున్నారు.

ఈ వార్త చూశాక అతను వచ్చి వెళ్లాక కనిపించని వస్తువులకి కారణం అర్థమై ఆశ్చర్యపోయారు కొందరు పరిచితులు... పూర్వాశ్రమ శిష్యులు.

✢ ✢ ✢

కేఎమ్ కోలుకునేప్పటికి చాలా సమయం పట్టింది. గోపాల్ సంగీత ప్రపంచాన్ని శాసించే కళాసామ్రాట్ కాగలడని కేఎమ్ ఎన్నోసార్లు అనుకునే వాడు. అందుకు కావల్సిన పథకాలూ ప్రణాళికలూ వేసుకునే వారు ఇద్దరూనూ. అమృతంలా ఉండే సంగీతభాండంలో చారెడు చెడ్డతనం చేరి పులిసిన కల్లుకుండ అయిపోయింది.

"అయినా గురూ.... ఇలాంటి దొంగవెధవల ముఖాలు మనం

చూస్తే వాడు మనకి కనిపించినప్పుడు జాగర్తపడతాం కదా! ముసుగు లెందుకు వేస్తారు?" అన్నాడు సంతోష్.

"అసలు దొంగని వదిలేసి ముసుగేసిన డమ్మీ దొంగల్ని చూపిస్తారేమో మన పోలీసోళ్లు" మూర్తికి గొప్ప డౌట్ వచ్చింది.

"అసలీ ముసుగులు దొంగలు రడీగా పెట్టుకుంటారా? పోలీసోళ్లే టీవీవాళ్లు వచ్చేప్పుడు ఈ దొంగ వెధవలకి అద్దెకిస్తారా?" సంతోష్ సందేహం.

"వాణ్ణి ఓ పాట పాడమనాల్సిందిరా" అన్నాడు మూర్తి.

అందరూ నవ్వుకుంటూ జోకులేసుకుంటున్నారు.

కేఎమ్‌కి నవ్వూరావట్లేదు. వాళ్ల మాటలూ వినబడట్లేదు.

వీడికి ఎడ్రస్సు లేదు. కేరాఫెడ్రస్సూ లేదు. అయినవాళ్లు ఇంట్లోంచి గెంటేసుంటారు. లేదా ఇవ్వాల్టి నుంచి ఇంట్లోకి రానియ్యరు.

బెయిలుండదు - ఎడ్వొకేట్లు ఉండరు - జైల్లో రామదాసు కీర్తనలు ప్రాక్టీసు చేసుకోవటమే.

✦ ✦ ✦

నిజంగా కేఎమ్ అనుకున్నంతా అయింది.

టీవీలో వార్తలు చూశాక... కేసు పెట్టినవాళ్లందరూ ఫైళ్లు కెలకమని వాళ్ల వాళ్ల పరిధిల్లోని పోలీసు స్టేషన్‌కెళ్లి... ఫలానా చిలకలగూడ పోలీసు స్టేషన్ అధీనంలో ఉన్నాడని రిమైండ్ చేశారు.

అన్ని బాణాలూ తలో వైపు నుంచి ఎక్కుపెట్టి ఉన్నప్పుడు గోపాల్‌కి తల తిరిగిపోయింది. తలకెక్కిన అభినందనల పొగరు దిగింది. తాగి

తాగి నరాలకెక్కిన కిక్కు దిగింది.

గౌరవం సంపాదించుకోవటం ఎంత కష్టమో దాన్ని నిలబెట్టుకోవటం ఇంకెంత కష్టమో అనుభవానికి వచ్చింది.

అమ్మిన సొమ్ములూ, తాకట్టు పెట్టిన నోట్లూ... పోలీసులు అతనితో కక్కించారుట!

చాలా నెలల తర్వాత జైలు నుంచి వచ్చిన గోపాల్‌కి అమ్మ కూడా తలుపులు తెరవలేదు. అన్న ముఖం మీదే తలుపులు మూసేశాడు.

అలా అంబరం ఎత్తు ఆనందాలకి ఎగరేసిన తన పాటే తన స్థాయినిలా దిగజార్చింది అని అనుకున్నాడో....

ఆ గాన సరస్వతే శపించిందోగానీ... గోపాల్‌కి ఇంక ఆ పాట పలకట్లేదు....

స్వరాలు ఉసూరుమంటున్నాయి. జీవితం అంతా తీగతెగిన వయోలిన్‌లా, శృతి లేని గీతంలా, గ్రీష్మంలో కోయిలలా అగమ్యగోచరంగా అయిపోయింది.

ఎవర్నో మోసం చేద్దామనుకుని తనకే ద్రోహం చేసుకున్నాడు.

ఆ తర్వాతెప్పుడూ... గోపాల్ ఎవ్వరికీ కనిపించలేదు.

ఆ బెంగా లేదు. కనిపిస్తాడేమోనన్న భయం తప్ప. కేఎమ్‌కి... వాడు జ్ఞాపకంలోక్కూడా రాకూడదనుకున్నాడు. వద్దనుకున్నాగానీ మంచి పాట విన్నప్పుడు... అపస్వరంలా గుర్తుకొస్తుంటాడు. 'ఆ దీపాన్ని అలాగే గాలికి వదిలెయ్యకుండా చేతులడ్డుపెట్టి కాపాడి ఉంటే?' అనిపిస్తుంది- వెంటనే... 'తన చేతులూ కాలితే....' అనిపిస్తుంది.

